## క్లుప్తంగా

### భీమవరం కోర్టుల ఏజీపీగా వరప్రసాద్



ఎమ్మెల్యే శ్రీనివాస్‌తో ఏజీపీ వరప్రసాద్ తదితరులు

సాక్షి, భీమవరం: భీమవరం కోర్టులక నూతనంగా నియమితులైన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యు వరప్రసాద్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో శ్రీనివాస్‌ను పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం రమణారావు, సీనియర్ న్యాయవాదులు రాయప్రోలు శ్రీనివాస మూర్తి, కామన నాగేశ్వరరావు,అల్లూరి శివాజీరాజు తదితరులున్నారు.

### పీవీఎల్‌ని కలిసిన ఎంఈఓ కనకరాజు



పీవీఎల్‌తో ఎంఈఓ కనకరాజు

కాళ్ల: కాళ్ల మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన గాదిరాజు కనకరాజు మంగళవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజును మర్యాద పూర్వకంగా కలిసారు. పెదఅమీరం లోని పార్టీ కార్యాలయంలో పీవీఎల్‌కి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన కనకరాజుని ఆయన అభినందించారు. విద్యా వ్యవస్థకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పాటు విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఈయన వెంట ఉపాధ్యాయులు కట్టా వెంకటేశ్వరరావు, బి.నాగమురళీశ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

### విద్యార్థులు అవకాశాలను వినియోగించుకోవాలి



నాగేంద్రపురంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు నగదు అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం వేలాది కోట్లు ఖర్చు పెట్టి అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రానికి మన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని సర్పంచ్ నాగిడి నారాయణస్వామి అన్నారు. భీమవరం మండలంలోని నాగేంద్రపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు ద్వారా మెరిట్ సాధించిన బస్వాని కృష్ణ వేణి, తిరుమాని నాగమణి, పొన్నాల జ్యోత్స్నలకు నగదు బహుమతులు అందజేశారు. హెచ్ఎం తంగికాల హరి ఆనంద ప్రసాద్ పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ రాజేష్‌కు సత్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): లయన్స్ ఇంటర్నేషల్ డిస్టిక్ టాప్ స్టార్ క్లబ్ అవార్డు అందుకున్న క్లబ్ అధ్యక్షుడు నందమూరి రాజేష్ ను స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సత్కరించారు. యూత్ హాస్టల్స్ జిల్లా కార్యదర్శి మట్లపూడి సత్యనారయణ, శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన వ్యక్తి రాజేష్ అని, తండ్రి తాతాజీ అదర్శలతో సమాజంలో సేవలందిస్తున్నారని, ఆయన లయన్స్ ఇంటర్నేషల్ డిస్టిక్ టాప్ స్టార్ క్లబ్ అవార్డు అందుకోవడం విశేషమని అన్నారు. రాజేష్ మాట్లాడుతూ ఈనెల 18న జరిగిన యాన్యువల్ అవార్డు ప్రదానోత్సవంలో ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. అనంతరం రాజేష్ ను ఘనంగా సత్కరించారు. జవ్వాధి శ్రీనివాస్, చుక్కనశ్రీ పాల్గొన్నారు.



# పట్టణాభివృద్ధికి నిర్మాణాత్మక చర్యలు

ఎమ్మెల్యే శ్రీనివాస్



భీమవరంలో మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పట్టణాన్ని వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టామని దీనికి పట్టణ ప్రజలు, అధికారులు పూర్తిగా సహకరించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అభివృద్ధి పనులపై మునిసిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాను రెండో పర్యాయం ఎమ్మెల్యేగా విధులు చేపట్టిన గత నాలుగేళ్లుగా పట్టణాభివృద్ధికి రూ.62 కోట్ల నిధుల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. దీనిలో భాగంగానే అన్ని వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రూ. 7.17 కోట్లు వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారు. పట్టణాభివృద్ధికి సంబంధించి ప్రగతి నివేదికలను ప్రతి వారం అందించాలని చేపల మార్కెట్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 7వ వార్డులోని లెప్రసీ కాలనీలో కూడా కమ్యూనిటీ హాల్, ఆర్టీసీ డిపో వెనుక, రూపాంతరం దేవాలయం వద్ద మెయిన్ డ్రెయిన్స్‌ను అభివృద్ధి చేయనున్నామన్నారు. అమృత పథకంలో నిర్మాణం పూర్తయిన రెండు మంచినీటి రిజర్వాయర్లను త్వరలోనే ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న డీఈ, ఏఈ పోస్టులను వెంటనే భర్తీ చేసే విధంగా కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారితో మాట్లాడినట్లు శ్రీనివాస్ చెప్పారు. విస్సాకోడేరు లే అవుట్ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను వేగంగా జరుగుతున్నాయని లేఅవుట్‌లోకి ఇంటి నిర్మాణ సామాగ్ర తీసుకెళ్లేందుకు రహదారిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, ఎంఈ త్రినాధరావు, డీఈలు తోట నారాయణరావు, విజయ్, ఏఈలు శ్రీనివాస్, కృష్ణమూర్తి, నవ్య పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో జి.కృష్ణమోహన్

ఆకివీడు: అంగన్ వాడీ కేంద్రాల్లో పనితీరు, పరిశుభ్రతల్ని మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్ పరిశీలించారు. బాల బాలికల హాజరు, వారికి అందుతున్న పౌష్టికాహారం, బాలింతలు, గర్భిణుల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. పసి కందులకు పెట్టే ఆహారంలో లోపాలు రానివ్వవద్దని సూచించారు. ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారం వారికి పూర్తి స్థాయిలో అందినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కమిషనర్ చెప్పారు. ఆయా కేంద్రాల్లో పని తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రత్నకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వలంటీర్ల ఇంటర్వ్యూలు పూర్తి

ఆకివీడు: మండలంలో, పట్టణంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులు భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు జరిగినట్లు ఎంపీడీఓ కె.వాణీ చెప్పారు. మొత్తం 10 పోస్టులకు 11 దరఖాస్తులు రాగా, ఇంటర్వ్యూలకు 8 మంది అభ్యర్థులే హాజరయ్యారని ఆమె తెలిపారు. ఇంటర్వ్యూలు పూర్తి అయిన అభ్యర్థుల వివరాల్ని జిల్లా కలెక్టర్ పీ.ప్రశాంతికి నివేదిస్తామని తెలిపారు.

### అధిక ఫీజులను నియంత్రించాలని వినతి



భీమవరంలో ఆర్డీఓ రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

సాక్షి, భీమవరం: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో వసూలుచేస్తున్న ఫీజు దోపిడిని అరికట్టాలని అఖిలభారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నాయకులు ఆర్డీఓ దాసి రాజుకు వినతిప్రతం అందజేశారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏబీవీపీ నగర్ సహాయ కార్యదర్శి వీడీ సిద్దార్థ ఆధ్వర్యంలో వినతిప్రతం అంఅందించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు, యూనిఫాం, పుస్తకాలు పేరిట పెద్ద మొత్తంలో వసూలుచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కె.దిన్ను, జి.గణేష్, బి.తేజ, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## యోగా ఆరోగ్యానికి ఆయుధం



ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం స్కూల్లో జెండా ఊపి యోగా ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీఓ రాజు



విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: యోగా ఆరోగ్యానికి ఆయుధం వంటిదని, వయస్సుతో ప్రమేయం లేకుండా అందరూ యోగా చేయడం వల్ల శారీరక, మానసికంగా ఆరోగ్యం పొందవచ్చునని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. ఎస్‌సీహెచ్ బీఆర్ఎం హైస్కూల్ విద్యార్థులతో మంగళవారం శ్రీ విజ్ఞానవేదిక అధ్వర్యంలో యోగ దినోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన యోగ అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీనకాలంలో యోగా వల్ల జీవనప్రమాణాన్ని పెంచుకోగలిగారని అందువల్ల దైనందిన జీవితంలో యోగ ఒక భాగంగా ముందుకు సాగాలన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్‌స జీపీసీ శేఖర్‌రాజు, పి.రామబద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

**యోగాపై అవగాహన**

పాలకోడేరు: అంతర్జాతీయ యోగా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పాలకోడేరు మండలం విస్సాకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం విద్యార్థులకు ఆసనాలు, ప్రాణాయామం ధ్యానం పై శిక్షనా కార్యక్రమం నిర్వహించారు. మంచి ఆహారపు అలవాట్లు, పోషకాహార ప్రాముఖ్యత, మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ రంగమనాయుడు సూచనల మేరకు ప్రకృతి వైద్యులు, డాక్టర్ సుజనగారి ఆధ్వర్యంలో హెల్త్ సూపర్వైజర్లు శ్రీనివాస్, నాగమణెమ్మ, లలిత, వాణి, ఏఎన్ఎంలు హేమ, భవాని, హెల్త్ అసిస్టెంట్ గోపాలకృష్ణ ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు రైతులకు అధిక ప్రాధాన్యత



స్థానిక ఆర్బీకేలో కౌలు రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ కేఎస్ఎస్.శ్రీనివాసరావు

ఆకివీడు: వ్యవసాయ రంగానికి రైతులు, కౌలు రైతులు రెండు కళ్లుగా ప్రభుత్వం భావిస్తుందని, కౌలు వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక పథకాలు అమలు జేస్తుందని ఏడీఏ కేఎస్ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక ఆర్బీకే వద్ద మంగళవారం కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు కార్డు పొందడం తన హక్కు అన్నారు. యజమానులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కౌలు చట్టాల్ని మార్పు చేసిందని చెప్పారు. కౌలు కార్డుతో అన్ని సదుపాయాలూ పొందవచ్చునని వివరించారు. కుప్పనపూడి గ్రామంలో జరిగిన కౌలు గుర్తింపు పై అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 1800 మందికి కౌలు కార్డులున్నాయన్నారు. భూమి యజమానులు సహకరించి, కౌలు వ్యవస్థ పటిష్టానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌలు కార్డు వల్ల యజమానికి ఏవిధమైన నష్టం, హానీ జరగదన్నారు. కౌలు దారులు ఆర్థికంగా నిలబడేందుకు పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీ, రైతు భరోసా, ధాన్యం అమ్మకాలు, ఈ క్రాఫ్ నమోదు, పంట నష్ట పరిహారం తదితర అంశాలపై కౌలు రైతులు లబ్ధి పొందేందుకు దోహదపడుతుందని ప్రియాంక చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు నంద్యాల చల్లారావు, మెంటే లక్ష్మణరావు, పలువురు రైతులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబంలో చిరునవ్వు కోసమే సురక్ష పథకం

ఆకివీడు: జగనన్న సురక్ష పథకం కార్యక్రమం ప్రతి ఇంటిలో చిరునవ్వులు కలగజేసేందుకని ఎంపీడీఓ కందుల వాణి చెప్పారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమ వివరాల్ని మంగళవారం ఆమె విలేకర్లకు చెప్పారు. ఈ నెల 23వ తేదీన సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. తదుపరి రోజు నుండి గ్రామాల్లో వలంటీర్లు, వీఆర్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు పొందని వారి వివరాల్ని సేకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా మండలంలో రెండు టీములుగా ఎంపీడీఓ, తహశీల్దార్లతో ఏర్పడి జూలై 1వ తేదీ నుంచి ఆయా సచివాలయాల్లో వలంటీర్లు సేకరించిన దరఖాస్తుల్ని పరిశీలిస్తారని ఎంపీడీఓ తెలిపారు. దరఖాస్తు దారులకు అవసరమైన అన్ని ధ్రువ పత్రాల్ని మండల టీమ్ పర్యవేక్షణలో తక్షణం మంజూరు చేస్తామని చెప్పారు. తదుపరి దరఖాస్తును ఆన్‌లైన్‌చేసి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకం అందే విధంగా కృషి చేస్తామని వివరించారు. మండల టీమ్‌లు జూలై1, 4, 6, 11, 18, 25 తేదీల్లో ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తారని ఎంపీడీఓ వాణి తెలియజేశారు.

## ఆరోగ్య మిత్రకు సత్కారం



కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న షేక్ రసూల్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని వివిధ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందించేందుకు నియమించిన ఆరోగ్య మిత్ర పనితీరులో ఉత్తమ పని తీరు కనబరిచిన వారికి ప్రతి నెలా ఒకరిని ఎంపిక చేసి ప్రశంసా పత్రం, ఐదు వేల రూపాయల చెక్కును ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అందజేస్తారు. ఈఏడాది ఏప్రిల్ నెలకు గాను భీమవరం జ్ఞానానంద కంటి హాస్పిటల్‌లో పని చేస్తున్న షేక్ రసూల్‌ను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో స్పందన సమావేశ మందిరంలో మంగళవారం షేక్ రసూల్‌కు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తన చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని, రూ 5 వేల రూపాయల చెక్కును అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆండ్రూస్, టీమ్ లీడర్ సత్తిబాబు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



కాలువలోని చెత్తను తీస్తున్న సిబ్బంది

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరు పంటకాలువలో మంగళవారం ప్లాస్టిక్ వ్యర్థాలు సాగు, తాగునీరు ప్రవాహానికి ఆటంకం కలగడంతో తొలగించారు. జూన్ 1న ఇరిగేషన్ అధికారులు పంటకాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో రెగ్యులేటర్ల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం పేరుకు పోయాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి తమ సిబ్బందితో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం తొలగిస్తున్నారు. ఇరిగేషన్ ఏఈ భూపతిరాజు వెంకట ప్రసాదరాజు మాట్లాడుతూ పంటకాలువల్లో చెత్త, చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దిగువ గ్రామాల ప్రజలు ఈ నీటినే తాగుతున్నారని గమనించి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

### గోదాములో అగ్ని ప్రమాదం



గోదాములో ఎగిసిపడుతున్న మంటలు

సాక్షి, భీమవరం: పట్టణంలోని నర్సయ్య అగ్రహారంలో ఉన్న ఒక గోదాములో మంగళవారం రాత్రి మంటలు ఎగిసిపడ్డాయి. గోదాములో బ్లీచింగ్‌తోపాటు శానిటరీ సామగ్రి ఉందని పలువురు చెబుతున్నారు. మంటలతో పాటు దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రమాద పరిసర ప్రాంత ప్రజలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపకాధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు , సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## పవన్ రాజకీయాలకు అనర్హుడు



విలేకరులతో మాట్లాడుతున్న కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: కులాల మధ్య చిచ్చు పెట్టి యువతను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాజకీయాలకు అనర్హుడని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు అన్నారు. ఏఎంసీ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ప్రాణ హాని ఉందని, సుపారీ గ్యాంగ్‌లు వచ్చాయని పవన్ కల్యాణ్ చౌకబారు విమర్శలు చేసి జనసేన పార్టీకి చెందిన యువతను రెచ్చగొడుతున్నారన్నారు. చంద్రబాబు వల్లే పవన్‌కి ప్రాణ హాని ఉందన్నారు. తనకు నిజంగా ప్రాణ హాని ఉంటే రాష్ట్ర డీజీపీని కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేయవచ్చని వినిస్టన్‌బాబు సలహా ఇచ్చారు. అన్నదమ్ములుగా జీవిస్తున్న మాల, మాదిగలను విడదీసిన ఘనత చంద్రబాబుదేనన్నారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్ర కుల పేదలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచినంతకాలం ఎన్ని పార్టీ ఏకమైనా జగన్‌ని ఓడించలేరని వినిస్టన్‌బాబు అన్నారు. సమావేశంలో లీగల్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్లపాటి ఆనందరావు, పార్టీ నాయకులు పాలపర్తి కృపనాథ్, ఏనుగుపల్లి చంద్రశేఖర్, సబ్బే శ్రీను, ఊటాల చిట్టిరాజు, దేవ రాజేష్‌కుమార్, వాసా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### మావుళ్లమ్మ సేవలో సినీ హీరో విష్ణు



శ్రీమావుళ్లమ్మవారి సన్నిధిలో హీరో శ్రీ విష్ణు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్ళమ్మ వారిని మంగళవారం సామజవరగమన సినిమా హీరో శ్రీ విష్ణు , హీరోయిన్ రెబ్బ మౌనిక దర్శించుకున్నారు . వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వారికి వేద ఆశీర్వాదం అందించారు .

## మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



మొగల్లులో ప్రమాదకరంగా ఉన్న మలుపులు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న వాహనదారులు

పాలకోడేరు: భీమవరం నుంచి తణుకు వెళ్లే రహదారిలో పలుచోట్ల రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా తయారయ్యాయి. కోరుకల్లు నుంచి అత్తిలి, ఇరగవరం, తణుకు వైపు వెళ్లే రహదారులపై కొన్నిచోట్ల ఎల్ ఆకారంలో, మరి కొన్నిచోట్ల జెడ్, ఎస్ ఆకారంలో మలుపులు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారులపై మలుపుల వద్ద రోజూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు త్రుటిలో బయట పడిన సందర్భాలనేకం. అత్తిలి–ఇరగవరం రహదారిలో సెంటర్‌కు అతి సమీపంలో బండిరేవు వద్ద ఎల్ ఆకారంలో ఉన్న మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఇక్కడ వాహనదారులు బిక్కు బిక్కు మంటూ ప్రయాణిస్తారు. తణుకు వైపు వెళ్లే వాహనాలు, భీమవరం వైపు నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పకోవడం ఆటోలకు, మోటార్ సైక్లిస్టులకు గగనంగా ఉంటుంది. భీమవరం వైపు వెళ్లే రహదారిలో పలు మలుపులు ఉన్న ఎల్ ఆకారపు మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. పుంత మునలమ్మ గుడివద్ద ఉన్న మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. మందలపర్రు వంతెన మలుపు గమనించక ఇటీవలే ఒకలారీ, మరో టాక్సీ మలుపు వద్ద కాల్వలోకి దూసుకుపోయాయి. ఊరిబయట మలుపుల్లో తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇలాంటి మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణలు, మార్గ సూచికలు ఏర్పాటుచేస్తే కొంతైనా ఫలితం ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.

### శరవేగంగా డ్రెయిన్ పనుల పూర్తి

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న డ్రెయిన్ పనులను మంగళవారం మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరిశీలించారు. గ్రామంలో డ్రెయిన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో గడపగడపకు కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి యుద్ధప్రాతికపదికపై గారగాలమ్మ డ్రైనేజీ ప్రక్షాళన పనులను చేపట్టారు. పనులు ప్రారంభించినప్పటి నుంచి శ్రీరంగనాథరాజు ప్రతిరోజు డ్రెయిన్ పనులను పర్యవేక్షిస్తూనే ఉన్నారు. డ్రెయిన్ మొదటి దశ పనులు పూర్తి కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో నల్లపరాజు వేణుగోపాల ఆదినారాయణ రాజు, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి రాముడు, బలుపు కేదారి, కుడిపూడి రామకృష్ణ, వీఆర్వో ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినికి నగదు బహుమతి

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల్లో కృషి, ఎట్టుదల ఉంటే ఎలా..ఎక్కడ చదివినా ర్యాంకులు వాటంతట అవే వస్తాయని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ నాయకుడు కేఎన్ శివాజీ అన్నారు. మంగళవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రటరీ వై.తారకనాథ్ 19వ వర్థంతి సందర్భంగా నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించిన బీఆర్ఎంవీ మునిసిపల్ గరల్స్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థిని ఆర్.నవ్య తరంగిణికి రూ. 10 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులు నవ్యను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ యూనియన్ నాయకులు ఎంఎస్ఎస్ బాబు, బి.సూరిబాబు, శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. ప్రభాకరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.